## క్లుప్తంగా

### విద్యుత్ సమస్య పరిష్కరించండి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల గ్రామంలో నిత్యం విద్యుత్ సమస్యలు ఏర్పడుతున్నాయని, ఎన్పీడీసీఎల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికుడు మానెం మహేష్‌తోపాటు గ్రామస్తులు బుధవారం తెలిపారు. గత పదిరోజులుగా సమస్యలున్నా ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు మరమ్మతులు చేయడం లేదన్నారు. వర్షాకాలం కావడంతో దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చొరవ చూపి సమస్య పరిష్కరించాలని కోరారు.

### పలిమెల ఎస్సైగా తమాషారెడ్డి

పలిమెల : పలిమెల స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఎస్సైగా జి.తమాషారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తమాషారెడ్డి వీఆర్ నుంచి పలిమెల ఎస్‌హెచ్‌ఓగా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై అరుణ్ హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి బదిలీ అయ్యారు.

### ఎస్సైని కలిసిన నాయకులు

టేకుమట్ల: టేకుమట్ల నూతన ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గట్ల సుధాకర్‌ను ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సంగి రవి బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. ఆయన వెంట రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ కూర సురేందర్‌రెడ్డి, వెల్లంపల్లి సర్పంచ్ మిట్టపెల్లి చంద్రయ్య, బొజ్జపెల్లి శంకర్, సతీష్, తదితరులు ఉన్నారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహదేవపూర్: మండలంలోని సురారం, పెద్దంపేట సబ్‌స్టేషన్ పరిధిలో నేడు (గురువారం) విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ల పరిధిలో 33 కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకారించాలని ఓఈ శ్రీకాంత్ కోరారు.

### వాహనాల తనిఖీ



టేకుమట్ల: సీపీఐ మార్కిస్టు వారోత్సవాల సందర్భంగా బుధవారం మండలంలోని వెంకట్రావుపల్లి, ద్వారకపేట శివారులో ఎస్సై గట్ల సుధాకర్ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, అనుమానితుల వివరాలను తెలుకుని వదిలిపెట్టారు. ఆయన వెంట ఏఎస్సై అమరేందర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్, కానిస్టేబుల్ మహేందర్, టీఎస్‌ఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

### ఫాగింగ్ మిషన్ల మరమ్మతు

కాటారం: వర్షాకాలంలో దోమల వ్యాప్తిని నివారించడం కోసం ఉపయోగించే ఫాగింగ్ మిషన్లకు బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అధికారులు మరమ్మతు చేయించారు. ఆరు ఫాగింగ్ మిషన్లు గత కొంత కాలంగా చెడిపోయి వినియోగంలోకి రాలేదు. దీంతో ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎంపీఓ ఉపేంద్రయ్య హనుమకొండ నుంచి టెక్నిషియన్లను రప్పించి మిషన్లను రిపేర్ చేయించారు.

### ఎంపీపీపై వీగిన అవిశ్వాసం



మహదేవపూర్: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆర్డీఓ రమాదేవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఎంపీపీ రాణిబాయిపై అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించుటకు ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని 15 రోజుల క్రితం నోటీసులు ఇచ్చారు. అయినప్పటికీ బుధవారం అవిశ్వాస తీర్మాన సమావేశానికి ఎంపీటీసీలు హాజరు కాలేదు. దీంతో ఎంపీపీపై ఇచ్చిన అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ఆర్డీఓ తెలిపారు. అవిశ్వాసం గెలిచిన ఎంపీపీ రాణిబాయి బాణాసంచా కాల్చి, ర్యాలీ నిర్వహించి సంబురాలు నిర్వహించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం బీఆర్ఎస్ ఎంపీటీసీలు ఒక ప్రకటనలో రాష్ట్ర వ్యాప్తంగా అవిశ్వాస తీర్మానంపై హైకోర్టులో వాజ్యం నడుస్తుందని హైకోర్టు తీర్పునకు అనుగుణంగా నడుచుకుంటామని అందువల్ల ఈరోజు సమావేశానికి హాజరుకాలేదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

# వరద బాధితులకు చేయూత

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో సర్వం కోల్పోయిన కుటుంబాలకు దాతలు చేయూతనందిస్తున్నారు. బియ్యంతోపాటు వంట సామగ్రి, దుస్తులు, తోచినంత డబ్బు సాయం చేస్తూ వారి దయాహృదయాన్ని చాటుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం పలు గ్రామాల్లో బాధితులకు దాతలు సహకారం అందించారు.



చిట్యాల: సరుకులు అందజేస్తున్న జెడ్పీటీసీ గొర్రె సాగర్

చిట్యాల: మండలంలోని చైన్‌పాక, వెంచరామి గ్రామాల్లోని వరద బాధితులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు జెడ్పీటీసీ గొర్రె సాగర్ బుధవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య, సర్పంచ్‌లు రేణుకుంట్ల స్వరూప సదానందం, కచ్చు మల్లేష్, సిద్దంకి భాస్కర్, ఎంపీటీసీ భూక్యా సుజాత రాజు నాయక్, నాయకులు బొమ్మ శరత్, కాసు కుమార్, పల్లె శిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**దాతల సహకారం..**

భూపాలపల్లి అర్బన్: మండలంలోని మోరంచపల్లి గ్రామంలో వరద బాధితులకు స్వచ్ఛంద సంస్థలు, ఫౌండేషన్, వివిధ పార్టీల నాయకుల నుంచి సహకారాలు అందుతున్నాయి. వరదల్లో సర్వం కోల్పోయిన బాధితులు వండుకొని తినడానికి బియ్యం, నిత్యవసర వస్తువులు కురువు కావడంతో గత ఐదు రోజులుగా దాతలు ముందుకు వచ్చి స్వచ్ఛందగా నిత్యవసర సరుకులు, బియ్యం, బట్టలు, గిన్నెలు, గ్యాస్‌లు, ఇతర వస్తువులను పంపిణీ చేస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌కు చెందిన పీజేఎస్ పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి కుటుంబానికి బట్టలు, చెద్దర్లు పంపిణీ చేశారు. టీడీపీ ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం, నిత్యవసర వస్తువులను పంపిణి చేయగా, కాళేశ్వర బ్రహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వరద బాధితులకు దుప్పట్లు, చీరలు, పంచలు, తువ్వాలు పంపిణి చేశారు.



భూపాలపల్లి అర్బన్: దుస్తులు పంపిణీ చేస్తున్న పీజేఎస్ పాల్ ఫౌండేషన్ సభ్యులు



చలివాగు వంతెనను పరిశీలిస్తున్న మధుసూదనాచారి

**మోరంచపల్లి బాధితులకు భరోసా ఇవ్వాలి**

భూపాలపల్లి రూరల్: మోరంచపల్లి వరద బాధితులకు భరోసా ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మొక్కిరాల జానార్ధన్‌రావు అన్నారు. బుధవారం మోరంచపల్లిలో బాధితులకు టీడీపీ నాయకులు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేశారు. మృతి చెందిన నలుగురు కుటుంబ సభ్యులకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. మోరంచపల్లి గ్రామ విషయంలో ప్రభుత్వం స్పందించకపోవడం దురదష్టకరమని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నష్టాన్ని సర్వే చేయించి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బంటు వెంకటేశ్వర్లు, పోలంపల్లి అశోక్, పైడి గోపాల్‌రెడ్డి, కసిరెడ్డి శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

**అంకుషాపూర్‌లో..**

మొగుళ్లపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాల వరదలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ.2 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ గండ్ర సత్యనారాయణరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అంకుషాపూర్ గ్రామ వరద ముంపు బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరదలతో నష్టపోయినవారికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. వరదలతో సర్వం కోల్పోయిన గ్రామ ప్రజలకు సింగరేణి, జెన్కో సేవ్ నిధులు, విపత్తు నిధులతో అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి ఆయన సూచన చేశారు. గ్రామస్తులకు తక్షణ సాయం కింద వెంటనే ఒక్కో కుటుంబానికి రూ.50 వేలు, మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరదలతో దెబ్బతిన్న పంట పొలాల రైతులకు ఎకరానికి రూ.2లక్షల సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆకుతోట కుమారస్వామి, బండి సుదర్శన్ గౌడ్, నడిగోటి రాము, ప్రకాష్ రావు, రాజు, మహేందర్, శ్రీనివాస్ రెడ్డి, కొడగాని హేమంత్ రావు, శ్రీకాంత్, వంశీ, లింగమూర్తి, రఘుపతి, సంపత్ తదితరులు ఉన్నారు.

**బ్రెడ్‌ప్యాకెట్లు పంపిణీ**

భూపాలపల్లి రూరల్: మోరంచ పల్లి వరద బాధిత కుటుంబాలకు పరకాల పట్టణంలోని ధనుశ్రీ బేకరీ యజమాని మునిస్వామి ఆధ్వర్యంలో 300 బ్రెడ్స్ ప్యాకెట్లను పంపిణీ శారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హజరై పంపిణీ చేశారు. సర్పంచ్ కమలబాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

**వరద బాధితులకు 'సిరికొండ' భరోసా**

టేకుమట్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జల దిగ్బంధమైన మండలంలోని పెద్దంపల్లి, రామకిష్టాపూర్(వి) గ్రామాల ప్రజలకు ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి బుధవారం నిత్యత్యావసర సరుకులను అందించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం టేకుమట్ల- రాఘవరెడ్డిపేట చలివాగుపై నిర్మించిన హైలెవల్ వెంతెన కూలిపోవడంతో సందర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కత్తి సంపత్‌గౌడ్, గునిగంటి మహేందర్, చింతలపెల్లి స్వామిరావు, శ్రీనివాస్, ఉమేందర్‌రావు, రాజిరెడ్డి, అభిరాజు, కమురోద్దీన్, సాగర్ ఉన్నారు.



భూపాలపల్లి రూరల్: సాయం అందజేస్తున్న నాయకులు



మొగుళ్లపల్లి: సరుకులను పంపిణీ చేస్తున్న గండ్ర



బ్రెడ్‌ప్యాకెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ బాధ్యులు

చిట్యాల: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిట్యాల పోలీసులు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో ఎస్సై రమేష్ ఆదేశాల మేరకు పోలీసులు గౌస్, వీరారెడ్డి, అస్లాంజానీ, నవీన్ కుమార్‌లు ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్ గౌస్ మాట్లాడుతూ గతంలోలాగా.. ఇంట్లో చొరబడి దొంగతనాలు చేయడం లేదని.. ఇంటర్‌నెట్‌ను ఉపయోగించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. రైతులకు ధాన్యం డబ్బులు నేరుగా ఇవ్వకుండా అకౌంట్‌లో జమచేస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎవరికీ ఓటీపీ చెప్పకూడదని, తెలియని లింకులు ఓపెన్ చేయకూడదని చెప్పారు. యువకులు ఆన్‌లైన్‌లో వస్తువులు కొనేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని, ముందే ఎవరికీ డబ్బులు పంపించొద్దని తెలిపారు. ఫేస్‌బుక్‌లో గుర్తుతెలియని వ్యక్తులతో చాటింగ్ చేయొద్దన్నారు. లోన్ యాప్‌లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎలాంటి సైబర్ నేరాలు జరిగిన వెంటనే 1930 లేదా 100కు డయల్ చేయాలని చెప్పారు.

**సైబర్ నేరాల పై అవగాహన**

మహదేవపూర్: మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం షీటీమ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి మోసపోవద్దని సూచించారు. మహిళలు, విద్యార్థినులు ఆపద వస్తే వెంటనే 87126 58162 లేదా.. టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి సాయం పొందాలని షీటీమ్ ఎస్సై శ్రీలత తెలిపారు. దేవేంద్ర, సాజిద్, నరేష్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

# రూ.3,28,776 రికవరీకి ఆదేశాలు

- ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడి

మహాముత్తారం: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అధికారులు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజికి తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులోభాగంగా 1-6-2021నుంచి 31-3-2023 వరకు మండలంలోని గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలపై మంగళవారం అర్ధరాత్రి వరకు ప్రజావేదిక నిర్వహించారు. 24గ్రామపంచాయతీల్లో 1,083పనులు నిర్వహించగా.. రూ.9,92,14,708 ఖర్చు చేసినట్లు తెలిసింది. అందులో ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఈసీలు, సీఏలు, ఎంపీఓలతోపాటు మరికొంత మంది చేసిన తప్పిదాల వలన రూ.3,28,776 అవకతవకలు జరిగాయని గుర్తించి, అధికారులు రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నం సుభద్ర, జెడ్పీటీసీ లింగమల్ల శారద, డీఆర్‌డీఓ అవినాష్, ఏడీవీసీ రుబీన, ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, రవీంద్రనాథ్, ఏపీఓలు కుమారస్వామి, సునిత, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# హరితహారం లక్ష్యాన్ని అధిగమించాలి

- ఎంపీడీఓ శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కాటారం: తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా గ్రామపంచాయతీలకు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా మొక్కలు నాటాలని ఎంపీడీఓ శంకర్ నాయక్ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం హరితహారంపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ఎంపీడీఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 20 వరకు గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటే ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. రైతులు తమ భూముల్లో పండ్ల తోటలు నాటుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. పండ్ల మొక్కల పెంపకం కోసం మండలానికి కలెక్టర్ వంద ఎకరాల టార్గెట్ ఇవ్వగా 30 ఎకరాల మేర రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. మిగిలిన 70 ఎకరాల లక్ష్యం పూర్తయ్యేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలన్నారు. గిరివికాస్‌లో లబ్ధి పొందిన రైతులు పండ్ల మొక్కలు, ఆయిల్‌పామ్ సాగు చేసుకునేలా చూడాలని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ ఉపేంద్రయ్య, ఏపీఓ వెంకన్న, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలి



శిక్షణలో మాట్లాడుతున్న రాజమల్లయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

కాటారం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం కోర్స్ కో ఆర్డినేటర్, మండల నోడల్ అధికారి మీస రాజమల్లయ్య తెలిపారు. కాటారంలో బుధవారం నిర్వహించిన ఎఫ్‌ఎల్‌ఎన్ మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని రాజమల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు బోధన ప్రణాళికను అనుసరిస్తూ విద్యార్థికి సులువుగా అర్థమయ్యే బోధనా పద్ధతిని ఎంచుకోవాలని సూచించారు. విద్యార్థి స్థాయిని గ్రహించి అందుకు అనుగుణంగా బోధించాలని చెప్పారు. విద్యార్థుల్లో సానుకూల దృక్పథం, ఆత్మవిశ్వాసం పెంపొందించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, గుణాత్మక విద్యను ముందుకు తీసుకెళ్లడానికి అందరం సమష్టి కృషి చేయాలని పేర్కొన్నారు. శిక్షణ చింతకాని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు రజిత, శిక్షణ ఇన్‌చార్జ్ కిషన్‌నాయక్, విషయ నిపుణులు తిరుపతి, మోహన్ పాల్గొన్నారు.

**విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించాలి**

భూపాలపల్లి రూరల్: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని భూపాలపల్లి మండలనోడల్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తొలిమెట్టు ఎఫ్‌ఎల్‌ఎన్ ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం ఈనెల 8వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.

# కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

చిట్యాల: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం 28వ రోజుకొనసాగింది. సమ్మెపై ప్రభుత్వం పట్టింపులేనట్టుగా వ్యవహరించడం సరికాదని మండల జీపీ కార్మికుల అధ్యక్ష, కార్యదర్శులు మ్యాదరి రాజేందర్, జిల్లెల కుమార్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వంటావార్పు చేశారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది మొగిలి, సతీష్, యుగేందర్, సదయ్య, శంకర్, రత్నాకర్, కరుణాకర్ సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

**వంటా వార్పుతో నిరసన**

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 28వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా కార్మికులు వంటావార్పు ద్వారా నిరసన తెలిపారు. గ్రామపంచాయతీ ఉద్యోగుల జాక్ జిల్లా అధ్యక్షుడు తార్లపల్లి శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం చొరవ చూపి పరిష్కరించాని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉద్యోగుల సంఘం భూపాలపల్లి మండల అధ్యక్షుడు వేల్పుల నరేష్, ప్రధాన కార్యదర్శి అజ్మీరా నందు నాయక్, నాయకులు భాస్కర్, రాజ్ కుమార్, నరేష్, తిరుపతి, జనార్ధన్ పాల్గొన్నారు



భూపాలపల్లి రూరల్: దీక్షలో భోజనాలు చేస్తున్న కార్మికులు

**దున్నపోతుకు వినతిపత్రం**

మొగుళ్లపల్లి: పంచాయతీ కార్మికులు తమ సమ్మెలో భాగంగా బుధవారం సంఘం మండల అధ్యక్షుడు బైరగోని కుమారస్వామి ఆధ్వర్యంలో దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. అబ్బు, మ్యాదరి రమేష్, జగన్నాథం, శ్రీరాం కృష్ణయ్య, వెంకటేష్, సుధాకర్, కొమురయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు

# తల్లిపాల వారోత్సవాలు



చిన్నారులకు కిశోరామృతం పంపిణీ చేస్తున్న సర్పంచ్



పలిమెల : వారోత్సవాల్లో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్, పిల్లలు, తల్లులు

మహాముత్తారం: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని నాల్గో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు కిశోరామృతాన్ని సర్పంచ్ పంపిణీ చేశారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన పోషకాహారాలపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మండల లత, అంగన్‌వాడీ టీచర్ లింగమల్ల శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

పలిమెల : మండలంలోని బూరుగుగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్ శివమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలన్నారు. బిడ్డకు తల్లిపాలతో రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. సర్పంచ్ చుక్కమ్మ, పిల్లలు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న పుట్ట మధు, రాకేష్ తదితరులు

మల్హర్: మండలంలోని కొండపేట గ్రామ పంచాయతీ పరిధిలోని పోచయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈమేరకు బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేష్ బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. పోచయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు, కొండపేట సర్పంచ్ కుమారస్వామి, తాజుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

## నష్టపోయిన పంట పొలాల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

మల్హర్: మండలంలోని వల్లెకుంట, శాలపల్లి, పీవీనగర్ గ్రామాల్లో వరదల కారణంగా నష్టపోయిన పంటలు, ఇసుక మేటలు వేసిన పొలాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంట పొలాలు నష్టపోయిన వివరాలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, న్యాయం జరిగేలా చూస్తామని హామీనిచ్చారు. అన్ని విధాలుగా నష్టపోయిన కుటుంబాలను సీఎం కేసీఆర్, ప్రభుత్వం ఆదుకుంటుందని, ఆధైర్య పడొద్దని భరోసా కల్పించారు.